




TS-20-0147370

# మన మాట

TELANAGANA సంపుటి 7 సంచిక 206

ప్రతి పదం ప్రజల పక్షం



SANDESH tv

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది



సోమవారం | 12 జనవరి | 2026 | పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


# వెనుక బడిన వర్గంలో వెలుగు దివ్వె

డబ్బుతో కాదు సేవతో రాజకీయాలు

బహిరంగంగా ప్రకటిస్తోన్న అరుదైన నేత

సీబీఐ విచారణకు సిద్ధమా?

అంటూ ప్రత్యర్థులకు సవాల్

ఎత్తరి మారయ్య ప్రజాజీవిత ప్రయాణం

2029లో ఎమ్మెల్యే కావడమే లక్ష్యం

హైదరాబాద్ నగరంలో రాజకీయాలు అంటేనే డబ్బు, బలం, లాబీలు, కబ్జాలు, కాంట్రాక్టులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నది అందరికీ తెలిసిందే. ఇక ఎన్నికల్లో పోటీ అంటే కోట్ల రూపాయలే కీలకంగా మారతాయన్నది కూడా ఎవరూ కాదనలేని సత్యం. ఉందని చెప్పుకోవడమే కాదు.. అది చూపిస్తేనే టికెట్ ఇస్తామంటున్న రాజకీయ పార్టీలు ఉన్న ఈ రోజుల్లో, నా దగ్గర డబ్బు లేదు.. కానీ, ప్రజల కోసం నిలబడే ధైర్యం ఉంది అని చెప్పే నాయకులు అరుదుగా కనిపిస్తారు. అలాంటి అరుదైన వ్యక్తుల్లో ఒకరు





జగద్గిరిగుట్టకు చెందిన ఎత్తరి మారయ్య. ఆ పేరే ఒక భిన్నమైన ప్రయాణాన్ని గుర్తు చేస్తుంది. గుట్ట ప్రాంతంలో ప్రజలకు బాగా తెలిసిన, పరిచయం ఉన్న పేరు ఎత్తరి మారయ్య. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఆయన దాదాపు ముప్పై ఏళ్లుగా ప్రజాజీవితంలో కొనసాగుతూ, కార్మికుల సమస్యలు, బస్తీల మౌలిక సదుపాయాలు, మహిళా సంఘాల పునరుద్ధరణ, ముఖ్యంగా రాళ్లు కొట్టే వడ్డెర క్వారీ కార్మికుల హక్కులు వంటి అంశాల్లో తనకు సాధ్యమైనంత వరకు అవసరార్థులకు అండగా ఉంటూ.. పనిచేసుకుంటూ వస్తున్నారు. అవసరమైతే పోరాటాలకూ సై అని ప్రభుత్వాలను ఒప్పించిన చరిత్ర ఆయనకు ఉంది. అత్యంత వెనుక బడిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఎత్తరి మారయ్య.. ప్రజా సేవలో తనకున్న మూడు దశాబ్దాల అనుభవంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని చెబుతున్నారు. ఒక సాధారణ వ్యక్తి నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుపై.. ఆయన జీవన ప్రయాణం, రాజకీయ జీవితం, తనపై వచ్చిన ఆరోపణలపై రియాక్షన్స్... ఇలాంటివన్నీ ఈ ప్రత్యేక కథనంలో చూద్దాం...

## పల్లె నుంచి నగరానికి... కష్టాలతో మొదలైన జీవితం

ఎత్తరి మారయ్య కుటుంబం 1980లలో బతుకుదెరువు కోసం ఊరి నుంచి హైదరాబాద్కు వచ్చి జగద్గిరిగుట్టలో స్థిరపడింది. ఆ రోజుల్లో ఆ ప్రాంతం బస్తీలతో నిండిన వెనుకబడిన ప్రాంతం. బస్తీల పరిస్థితి కష్టంగా ఉండేది. చిన్న చిన్న గుడిసెలు, రోజువారీ కూలీ పనులు, రాళ్లు కొట్టి జీవనం సాగించే కుటుంబాలు - ఇదే వాతావరణం. మారయ్య తల్లిదండ్రులు కూడా అదే వృత్తిలో జీవనం సాగించారు. రాళ్లు కొట్టే కూలీలుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకున్నారు. అయినా పిల్లలను చదివించాలనే ఆశతో ఎంతవరకు సాధ్యమైతే అంతవరకు చదివించారు. మారయ్య పదో తరగతి వరకు చదివినా, అక్కడితో ఫుల్స్టాప్ పడింది.



ఆర్థిక ఇబ్బందుల కారణంగా.. ఇంట్లో అవసరాలు, జీవన పోరాటం చూసి మారయ్య తన చదువు ఆపేశారు. కానీ, ఆయన జీవితం అక్కడితో ఆగలేదు. చదువు ఆగినా జీవితం ఆగకూడదు బతకాలంటే ఏదో ఒక పని నేర్చుకోవాలనే ఆలోచనతో టైలరింగ్ నేర్చుకున్నారు. ఆ నైపుణ్యంతో హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలో ఒక చిన్న టైలరింగ్ షాప్ తెరిచారు. టైలరింగ్ వృత్తి కారణంగా స్థానిక ప్రజలతో సంబంధాలు పెరిగాయి. మహిళలు, పురుషులు, కుటుంబాలు షాపుకు రావడం వల్ల పరిచయాల వలయం విస్తరించింది. అవే పరిచయాలు ఆయనకు తర్వాతి రోజుల్లో సామాజికంగా ఒక గుర్తింపును తీసుకొచ్చాయి. అది మారయ్య రాజకీయ జీవితం మొదలైన మొదటి మెట్టుగా చెప్పుకోవచ్చు.





## కాలనీ సమస్యల నుంచి రాజకీయాల్లోకి :



అప్పట్లో ఉన్నది గుడిసెలు, పట్టాలు లేని ఇళ్లు, కరెంట్, నీరు, రోడ్లు లేని బస్తీలు. జగద్గిరిగుట్ట ప్రాంతంలో మౌలిక వసతుల కొరత తీవ్రంగా




ఉండేది. కాలనీల్లో అప్పటి సమస్యలు చిన్నవి కావు. కరెంట్ పోల్స్ లేవు, మీటర్లు లేవు, నీటి కనెక్షన్లు లేవు, రోడ్లు సరిగ్గా లేవు, మోరీలు లేక వర్షాకాలంలో దుర్గంధంతో ఇబ్బందులు. ఇలాంటి సమస్యలు చూస్తూ ఈ సమస్యలపై మాట్లాడటానికి ఒక సొసైటీ అవసరమని మారయ్యలో ఆలోచన మొదలైంది. అదే సమయంలో రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన కూడా వచ్చింది. రాజకీయాల్లోకి వెళ్తే ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందనే భావనతో ఆయన కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితుడయ్యారు. స్థానిక నాయకుల ద్వారా కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక నాయకులు ఆయనను జిల్లా నాయకత్వానికి పరిచయం చేయడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన కొద్దికాలానికే పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ఒక పట్టణానికి ప్రధాన కార్యదర్శి పదవి ఊరికే ఇవ్వరు, ఒక సబ్జెక్ట్ ఉన్నవారికి, ప్రజల్లో తిరిగే వారికి, పని చేసే వారికి మాత్రమే ఈ అవకాశం ఇస్తారు అన్నింటికీ మించి పార్టీలో ఆయనపై నమ్మకం ఉంటేనే పదవి అంది వస్తుంది. అప్పటినుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రజల సమస్యలపై తిరుగుతూ రాజకీయ జీవితం కొనసాగించారు.





# వడ్డెర క్వారీ కార్మికుల పోరాటంలో కీలక పాత్ర

ఎత్తరి మారయ్య పేరు ఎక్కువగా వినిపించిన ప్రధాన సందర్భం వడ్డెర క్వారీ కార్మికుల సమస్యలు. ఆయన ప్రజాజీవితంలో కీలక మలుపు కూడా వడ్డెర క్వారీ కార్మికుల సమస్యలు, హక్కులతోనే వచ్చింది. జగద్గిరిగుట్ట ప్రాంతంలో రాళ్లు కొట్టే వృత్తితో జీవించే వడ్డెర కార్మికులకు ఒక పెద్ద సమస్య ఉంది. వాళ్లు పనిచేసే గుట్టలు, రాళ్లు కొట్టే భూములు ప్రభుత్వ భూములు, కానీ, కూలీలకు ఎలాంటి హక్కులు లేవు. దీంతో, తమ జీవనాధారం మీద హక్కు స్పష్టంగా లేకపోవడంతో... ఎన్టీఆర్ ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన జీఓ 185 ప్రకారం ఆ హక్కులు తమకే ఇవ్వాలని అప్పటి నుంచే ప్రయత్నాలు జరిగాయి. కానీ, అధికారుల దృష్టికి విషయం వెళ్లడం కష్టమైంది. అసలు అధికారుల దగ్గరికి ఎలా వెళ్లాలో, తమ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో అప్పటిదాకా అర్థంకాని స్థితిలో ఉన్న వడ్డెర క్వారీ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఆ సమయంలో మారయ్యను ఆశ్రయించారు. పెద్ద పెద్ద నాయకులతో సంబంధాలు ఉన్నవాడిగా, కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా ఉన్న నాయకుడిగా అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని కోరారు. దాంతో మారయ్య ప్రత్యేకంగా ఒక వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేసి, అధికారుల సమావేశాల్లో పాల్గొని, స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు కూడా వెళ్లారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో తెలుగుదేశం ప్రభుత్వం ఉండగా, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దగ్గరికి వెళ్తే పని అవుతుందని కొందరు చేసిన సూచనలతో, అప్పటి హోం మంత్రి దేవేందర్ గౌడ్ను కలిశారు మారయ్య. తమ వడ్డెర కార్మికుల సమస్యలు విన్నవించి జీఓ 185 ప్రకారం ఆ భూములు తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. మారయ్య చెప్పిన వివరాలు విన్న అప్పటి హోం మంత్రి దేవేందర్ గౌడ్.. ఈ సమస్యను తొందరగా పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్కు లేఖ రాశారు. దీంతో, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ కూడా పూర్తిచేసి, చివరకు 14 ఎకరాల 12 గుంటల స్థలాన్ని వడ్డెర క్వారీ లేబర్ కోఆపరేటివ్ సొసైటీకి కేటాయించాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఇది మారయ్య కృషి కారణంగా వడ్డెర కార్మికుల జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. అయితే, అదే సమయంలో ఎన్నికలు వచ్చాయి. పంపిణీ స్టేజ్ కు చేరి అందినట్టే



అందిన పట్టాల పంపిణీ ప్రక్రియ.. రాష్ట్ర ప్రభుత్వం మారడంతో నిలిచిపోయింది. అప్పుడున్న తెలుగు దేశం ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చింది. పట్టాలు రెడీ అయినప్పటికీ.. రాజకీయ మార్పులతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ప్రభుత్వం మారిన క్రమంలో పని ఆలస్యం అయ్యింది. అంతేకాదు, సొసైటీ సభ్యుల మధ్యే కొన్ని పేర్ల విషయంలో, అర్హుల గుర్తింపు విషయంలో విభేదాలు నెలకొని చర్చలు నడిచాయి. దీంతో, అప్పటి ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ దగ్గర పంచాయతీ చేసి, స్థలం కేటాయింపుల్లో సొసైటీలోని సభ్యులకు ఎవరికీ అన్యాయం జరగకుండా పేర్లు సరిచూసుకున్నామని మారయ్య గుర్తు చేసుకుంటారు. అయితే, కాలం గడిచేకొద్దీ కుటుంబాలు పెరిగాయి, కొత్త తరం



వచ్చేసింది, పెళ్లిళ్లు అయ్యాయి, పిల్లలు పెరిగారు. మొత్తంగా సభ్యులు 492 మంది అయ్యారని, 14 ఎకరాల 12 గుంటలు స్థలాన్ని 80 గజాల చొప్పున ప్లాట్లుగా పంచితే అందరికీ సరిపోయేలా పంచుతూ ముందుకెళ్తామని ప్రభుత్వానికి విన్నవించుకున్నట్లు మారయ్య చెబుతారు. కానీ, ఆ తర్వాత వీళ్ల నెత్తిమీద మరో పిడుగు పడింది. రాజీవ్ గృహకల్ప జీవో వచ్చింది. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక.. పట్టణ కేంద్రాల్లో ఇళ్లస్థలాల కోసం పట్టాలు ఇవ్వకూడదనే కొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. రాజీవ్ గృహకల్ప జీవో విడుదల చేసింది. వడ్డెర కార్మికుల జీవితం మళ్లీ ప్రశ్నార్థకంగా మారింది. దాంతో వడ్డెర క్వారీ లేబర్ కోఆపరేటివ్ సొసైటీకి పంచాల్సిన పట్టాలు రెడీగా ఉన్నప్పటికీ ఇవ్వలేని పరిస్థితి నెలకొందని మారయ్య అప్పటి అడ్డంకుల గురించి నెమరేసుకున్నారు. అయితే,



మారయ్య వెనక్కి తగ్గలేదు. సర్కారు తీసుకొచ్చిన ఈ కొత్త విధాన నిర్ణయం తమ వృత్తికి సరిపోదని, రాళ్లు కొట్టి జీవించే వాళ్లకు ఒకటి మీద ఒకటి అంతస్తుల్లో కట్టే ఇళ్లు కుదరవని, అప్పటికే తమకు మంజూరు చేసేందుకు రెడీ అయిన పట్టాలను నిలిపేశారని వాదిస్తూ.. ఎత్తరి మారయ్య నేతృత్వంలో సొసైటీ కోర్టుకు వెళ్లింది. వీళ్ల న్యాయ పోరాటం ఫలించింది. అయితే, స్థలం కొద్దిగా తగ్గినా.. మొత్తానికి విజయం సాధించారు. ఇది రాజీ కాదని, ఇది పేదల కోసం సాధించిన న్యాయం అని మారయ్య అంటారు. దీంతో, ప్రభుత్వం అంత జాగా వీళ్లకే ఇవ్వలేమని, కొద్దిగా తగ్గించి ఇస్తామంటూ.. చివరకు 9 ఎకరాల భూమిని సొసైటీకి కేటాయించి సభ్యులకు పంచిందని మారయ్య చెప్పారు. మిగతా భూమిలో రాజీవ్ గృహకల్ప ఇళ్లు కట్టారని అన్నారు. ఈ స్థలాల కేటాయింపులు జరిగిన తర్వాత అర్హులైన వారికే ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, ఈ మొత్తం ఎపిసోడ్ లో తాను మధ్యలో ఒక వారధిగా మాత్రమే పని చేశానని, తమ సామాజిక వర్గం సోదరులకు అండగా నిలిచానని మారయ్య వాదిస్తున్నారు.





## రాజకీయ అవకాశాలు.. అందినట్టే అంది దూరమైన పదవులు



మారయ్యకు రాజకీయంగా అవకాశాలు వచ్చినా.. అవి పూర్తిగా దక్కలేదు. ఒకసారి కౌన్సిలర్ టికెట్ దక్కలేదు. మరోసారి జీహెచ్ఎంసీ డివిజన్ల మార్పుతో సీట్ జస్ట్ లో మిస్ అయ్యింది. ఇంకోసారి ఇండిపెండెంట్గా పోటీ చేసినా.. వందల ఓట్ల తేడాతో తృటిలో ఓటమిపాలయ్యారు. అంతేకాదు.. పార్టీలు మారడాలు కూడా అవకాశాలు చేజారి పోయేలా చేశాయి. మొదట కాంగ్రెస్ పార్టీ తర్వాత వైసీపీ.. తిరిగి కాంగ్రెస్ పార్టీ.. మళ్లీ ఇతర పార్టీలు.. ఇలా ఆయన పయనం సాగింది. కానీ, ఒక విషయం మాత్రం మారలేదు.. ప్రజలతో సంబంధాలు, కార్మికుల కోసం పోరాటాలు మాత్రం వీడలేదు. మొత్తానికి మారయ్య రాజకీయ ప్రయాణం సాఫీగా సాగలేదు. 32 వార్డులు ఉన్న సమయంలో కౌన్సిలర్గా పోటీ చేయాలనుకున్నా అవకాశం దొరకలేదు. ఆ తర్వాత మున్సిపాలిటీ జీహెచ్ఎంసీలో విలీనం కావడంతో డివిజన్లు మారాయి. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత రాజకీయ సమీకరణాలు మారడంతో స్థానిక నాయకత్వంలో విభేదాలు వచ్చి తన సీట్ మిస్ అయిందని మారయ్య అంటున్నారు. ఆ పరిణామంతో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ.. కేవలం వందల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత పరిస్థితుల కారణంగా పలు పార్టీలు మారిన సందర్భాలు ఉన్నాయని, ఆయన స్వయంగా అంగీకరిస్తున్నారు. అయితే.. తాను డబ్బు కోసం పార్టీలు మారలేదని, పని చేసే వేదిక కోసం మాత్రమే పార్టీ మారానని ఆయన వాదిస్తారు.





## ఆరోపణలపై సీబీఐ అస్త్రం - ప్రత్యర్థులకు దమ్ముందా?


తనపై అన్యాయంగా ఆరోపణలు సృష్టించారని ఎత్తరి మారయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ల్యాండ్ గ్రాబర్' అంటూ తనపై చాలా పెద్ద ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. వాటిపై చాలా ఘాటుగా, తీవ్రంగా స్పందించారు. అయితే, ఆయన అడిగే ప్రశ్నలు మాత్రం సూటిగా ఉన్నాయి. నా మీద ఒక్క కేసైనా ఉందా?, ఒక్క రౌడీషీట్ ఉందా?, కేసులు, కోర్టుల చుట్టూ తిరిగానా?, నా దగ్గర వందల కోట్లు ఉన్నాయా? అని మారయ్య ఆక్రోశంగా ప్రశ్నిస్తున్నారు. వాళ్లంతా ప్రచారం చేసినట్లు.. తాను నిజంగా కబ్జా చేస్తే ఆస్తులు ఉండాలి, కేసులు ఉండాలి, తనతో నష్టపోయిన బాధితులు ఉండాలి కదా? అని కూడా నిలదీస్తున్నారు. ఈరోజు కూడా తాను ఒక అద్దె ఇంట్లో ఉంటున్నానని చెప్పారు. అసలైన కబ్జాలు చేసిన పెద్ద బిల్డర్లు, చెరువులు మింగినవాళ్లు, ఫారెస్ట్ భూములు కొట్టేసినవాళ్లు, అసైన్డ్ భూములు ప్లాట్లు చేసి అమ్ముతున్న వాళ్లు ఎంతో మంది ఉన్నారని, వాళ్ల పేర్లు ఎందుకు బయటకు రావడం లేదని మారయ్య మీడియాను కూడా ప్రశ్నిస్తున్నారు. తనమీద వస్తున్న ఆరోపణలపై, తనకు ఉన్న ఆస్తులపై ఇప్పటికిప్పుడు తాను సీబీఐ విచారణ ఎదుర్కొనేందుకు సిద్ధమని, మిగతా వాళ్లు కూడా వాళ్ల ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా? అని వాళ్లకా ధైర్యం ఉందా? అని ఛాయిస్ ఇచ్చారు. ప్రజాక్షేత్రంలోనే చూసుకుంటామంటూ సవాల్ చేస్తున్నారు.

## బస్తీల అభివృద్ధి - కనిపించని సేవ

మారయ్య చేసిన సేవలు ఫైళ్లలో ఉండకపోవచ్చు. కానీ, బస్తీల్లో ఉన్నాయి. కాలనీల్లో కనిపిస్తున్నాయి. కరెంట్ పోల్స్, మీటర్లు, డ్రైనేజీ కాలువలు, రోడ్లు, నీటి కనెక్షన్లు ఇలా మారయ్య చేస్తున్న సేవకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇలా బస్తీల్లో మౌలిక సదుపాయాల విషయంలో కూడా మారయ్య తాను చేసిన సేవలను గుర్తు చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పటి పరిచయాలతో, స్థానిక ఎమ్మెల్యే అండదండలతో పాటు.. బయట పరిచయాలతో చాలా బస్తీలకు కరెంట్ పోల్స్, మీటర్లు ఇప్పించడం, డ్రైనేజీ కాలువలు వేయించడం, రోడ్లు వంటి పనుల కోసం తిరగడం జరిగిందని అంటారు. అంజయ్య నగర్కు నీటి సరఫరా విషయంలో వాటర్ వరక్స్ కార్యాలయం చుట్టూ ఎన్నో సార్లు తిరిగానని గుర్తు చేసుకున్నారు.


### మహిళా సంఘాలు - పావలా వడ్డీ రుణాలు

మహిళా సంఘాల విషయంలో తన కృషి గురించి చెబుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జగద్గిరిగుట్టలో మహిళా



సంఘాలు నిర్వీర్యమైన పరిస్థితుల్లో వాటిని తిరిగి రీప్లేస్మెంట్ చేసి నిలబెట్టింది తానేనని అంటారు. పావలా వడ్డీ రుణాలు అందించే విధానంలో 300కి పైగా మహిళా సంఘాలను పునరుద్ధరించామని అన్నారు. అప్పట్లో ఒక్కో డ్వాక్రా సంఘంలో 20 నుంచి 24 మంది దాకా ఉండేవారని, ఇప్పుడు కేవలం 10 మందితో ఒక గ్రూప్ ఏర్పడుతోందని తెలిపారు. ఆ సంఘాలు తర్వాత సమాఖ్యలుగా ఎదిగాయని, ఆ ప్రయాణంలో తన పాత్ర ఉందని ఎత్తరి మారయ్య చెప్పారు.





# కరోనా కాలంలో సైలెంట్ సర్వీస్



కరోనా కాలంలో కూడా తాను చేసిన సేవల గురించి మారయ్య వివరించారు. లాక్డౌన్ సమయంలో చుట్టుపక్కల రోడ్లపై నడుచుకుంటూ వెళ్తున్న లేబర్లకు, దారిలో కనిపించిన కార్మిక కుటుంబాలకు, కొన్ని నెలల పాటు నిత్యం కిరాణా సరుకులు పంచానని చెప్పారు. ఒక్కో ప్యాక్ లో ఐదు కిలోల బియ్యం, సబ్బులు, సర్ఫ్, ఉప్పు, కారం, నూనెతో కూడిన ఒక వారం రోజులకి సరిపోయే ఆహార సరుకులు ఉండేలా రోజూ ఇంట్లోనే తయారు చేసేవాడినని తెలిపారు. అలా.. చేసిన ప్యాకెట్లను తన కారులో రోజుకు 30 నుంచి 35 దాకా పెట్టుకుని వెళ్లేవాడినని, దారిలో ఎవరు



కనిపిస్తే వారికి ఆ సరుకులు ఇచ్చేవాడినని చెప్పారు. అయితే, తనకు నాకు మిగిలిన దాంట్లోంచి, సాధ్యమైనంత వరకు చేశానని వినయంగా చెబుతారు ఎత్తరి మారయ్య. ఇంత చేసినా.. ప్రచారం లేదు. ఫోటోలు లేవు.. కేవలం ఆయనకు చేయాలన్న మనసు ఉంది.

## కార్మికుల కోసం నిలబడ్డ నాయకుడు

హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో భవన నిర్మాణాల్లో భాగంగా ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు 100శాతం నష్టపరిహారం ఇప్పించిన కేసులు వందల్లో ఉన్నాయంటారు మారయ్య. 2008 నుంచి ఇప్పటి వరకు పోలీసులతో, కంపెనీలతో మాట్లాడి కార్మిక కుటుంబాలకు న్యాయం చేశానని, చేస్తూనే ఉన్నానని అన్నారు. ఏవైనా పెద్ద నిర్మాణాల దగ్గర ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే, వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించడంలో తాను ముందుండేవాడినని చెబుతారు. 2008 నుంచి ఇప్పటివరకు వందల్లో కేసులకు పరిహారం ఇప్పించామని, ఇటీవలే మియాపూర్లో కూడా 14 లక్షల రూపాయలు పరిహారం ఒక కార్మికుడికి ఇప్పించానని ఉదాహరణగా చెబుతారు.

## బీసీ ఉద్యమం, రాష్ట్ర స్థాయి గుర్తింపు

ఎత్తరి మారయ్య ఇటీవలి రాజకీయ కార్యకలాపాల్లో మరో కీలక ఘట్టం ఇది. బీసీ ఉద్యమం. గత రెండు సంవత్సరాలుగా జాగృతి సంస్థతో కలిసి 70 కుల సంఘాలతో యునైటెడ్ పూలే ఫ్రంట్ ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా రౌండ్ టేబుల్స్ నిర్వహిస్తూ బీసీ ఉద్యమం నడుపుతున్నట్టు మారయ్య చెబుతున్నారు. ఈ పరిచయాల్లోనే జాగృతిలో తనకు బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్ష బాధ్యత ఇచ్చారని, ఒక అణగారిన వర్గానికి చెందిన వ్యక్తికి రాష్ట్ర స్థాయిలో ఇలాంటి బాధ్యత చరిత్రలో అరుదని, అందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తనకు డబ్బు కాదు మాట కావాలని, విలువ కావాలని అన్నారు. తన మీద ఉన్న ముద్ర నిజమా,





కాదా ప్రజలకు తెలిసి తీరాలన్న భావనతోనే తాను ముందుకు వెళ్తున్నానని మారయ్య అంటారు.

## ప్రజల మీద నమ్మకం

తన దగ్గర డబ్బు లేదు. కోట్లు లేవు.. కానీ, ప్రజల మీద నమ్మకం ఉందంటారు ఎత్తరి మారయ్య. ఆ నమ్మకంతోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నట్లు చెప్పారు. అయితే, ఆయన చెప్పే మరో నిజం.. నగర రాజకీయాల్లో డబ్బు ప్రభావం. ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే కోటి, రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని చెబుతున్నారు. సీట్ ఇవ్వాలంటే డబ్బు చూపించాలంటారు. కానీ, డబ్బులు పెట్టి రాజకీయాలు చేసే పరిస్థితి తన దగ్గర లేదని మారయ్య ఒప్పుకుంటారు. అదే సమయంలో ప్రజలు విశ్వసించి ఒక్క అవకాశం ఇస్తే, ప్రజాక్షేత్రంలో ప్రజలతోనే తేల్చుకుంటా అని కూడా ధీమా వ్యక్తం చేశారు. న్యాయం గెలుస్తదో, డబ్బు గెలుస్తదో చూద్దాం అని ప్రజలమీద ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. ప్రజలు నమ్మితే, ఒక్క అవకాశం ఇస్తే సేవతో పాలన సాగిస్తానని చెబుతున్నారు.

## కొడితే కుంభస్థలాన్నే కొట్టాలి -

## అసెంబ్లీ మెట్లెక్కాలి

తన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, ఎత్తుపల్లాలు, మానసికంగా నిద్రలేని రాత్రులుగా మార్చిన తీవ్ర ఆరోపణలపై ఎత్తరి మారయ్య తనదైన రీతిలో సమాధానం చెప్పాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలకు దిమ్మదిరిగేలా జవాబు చెప్పాలన్నది ఆయన



ఆశయం. అందుకోసం మారయ్య డబ్బును నమ్ముకోలేదు. కేవలం ప్రజలను, ప్రజా సేవనే నమ్ముకున్నారు. 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 70 కుల సంఘాల యునైటెడ్ బీసీ ఫ్రంట్ ప్రతినిధిగా ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్నది ఆయన జీవితాశయంగా పెట్టుకున్నారు. గడిచిన కొన్నేళ్లుగా తనను ఆరోపణలతో ఇబ్బందులు పెట్టిన వాళ్లకు శాసన సభలో నుంచి యావత్ తెలంగాణ సాక్షిగా టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా సమాధానం చెప్పాలన్న సమయం కోసం ఎత్తరి మారయ్య ఎదురుచూస్తున్నారు.

## ఎత్తరి మారయ్య ప్రస్థానం

ఎత్తరి మారయ్య జీవిత గాథలో కష్టం ఉంది, పోరాటం ఉంది, రాజకీయ మలుపులు ఉన్నాయి, ఆరోపణల బాధ ఉంది, సేవ చేసిన ఆధారాలున్నాయి. ఇది ఒక రాజకీయ కథనం కాదు.. ఇది కష్టంతో నిండిన ఒక నాయకుడి జీవన ప్రయాణం. మరి.. ఈ పయనంలో డబ్బు గెలుస్తుందా? న్యాయం గెలుస్తుందా? అనేది 2029లో జరగనున్న కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లే తేల్చాలి. మొత్తానికి మారయ్య జీవితం 'ఒక బండరాయిని సానబెట్టి శిల్పంగా మార్చినట్లు', కష్టాల్లో నుండి పుట్టి పోరాటాల ద్వారా నాయకుడిగా ఎదిగిన ప్రయాణంగా కనిపిస్తుంది.

అనిల్ కుమార్ కుంట....
సందేశ్ మీడియా...
93933 44405

